## విద్యుత్ చార్జీల తీర్పు

# కోర్టు పరిధికి సంకుచిత వ్యాఖ్య

కె. బాలగోపాల్

మానవహక్కుల కార్యకర్త,

హైదరాబాద్

విద్యుత్ చార్జీలను పెంచుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (Electricity Regulatory Commission) ఏప్రిల్ 27, 2000నాడు జారీ చేసిన ఆర్డర్ చెల్లదంటూ వివిధ సంస్థలూ వ్యక్తులూ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్లను జస్టిస్ వెంకట్రామిరెడ్డి, ఎస్.ఆర్.నాయక్‌ల బెంచి అక్టోబర్ 16న కొట్టేసింది. ఆ తీర్పును పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ప్రభుత్వం, లేక ప్రభుత్వం నియమించిన ఏదైనా సంస్థ తీసుకున్న నిర్ణయం అన్యాయమనుకుంటే బాధితులు కోర్టుకు పోతారు. ప్రభుత్వం చేయని న్యాయం కోర్టు చేస్తుందని ఆశిస్తారు. ప్రభుత్వ చర్యలపైన అప్పీల్ చేసుకునే వేదికగా ప్రజలు కోర్టును భావిస్తారు. ప్రభుత్వ చర్యల మంచి చెడులను పరిశీలించేటప్పుడు న్యాయస్థానాలకు ఏ హద్దులూ లేవని సాధారణంగా ప్రజలు అనుకుంటారు.

భారత రాజ్యాంగం ప్రభుత్వ చర్యలనూ విధానపరమైన నిర్ణయాలనూ సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఇచ్చిందిగానీ ఆ సమీక్ష ఏ పరిధిలో చేయవచ్చుననేది వివాదాస్పదంగా ఉంది. చట్టంలో కచ్చితంగా పేర్కొన్న ఒక హక్కును ఆ ప్రభుత్వ చర్య స్పష్టంగా అతిక్రమించినట్టయితే న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయి. అంతకు మించి ప్రభుత్వాల చర్యలలో కోర్టులు జోక్యం చేసుకోవనీ, ప్రభుత్వాలు ఎవరికి ఏమిస్తాయి, ఏ పని ఏ విధంగా చేస్తాయి, దేశపాలనలో ఏ విధానాలు అనుసరిస్తాయి అనేది ప్రభుత్వాల ఇష్టమనీ సంప్రదాయక న్యాయసిద్ధాంతం చెప్తుంది.

ఉదాహరణకు సముద్రం ఒడ్డున ఉన్న జాలర్ల ఇళ్లను ప్రభుత్వం తొలగించి మోటార్ బోట్లతో

రొయ్యల వేటసాగించే పరిశ్రమ కోసం అక్కడ రేవు నిర్మించాలని నిర్ణయిస్తుంది. ఆ నిర్ణయం తప్పా? ఒప్పా? అని కోర్టులు చూడజాలవు. అప్పటి వరకు అక్కడ ఉన్న జాలర్లకు ఆ ఇళ్ళ స్థలాల మీద చట్టపరమైన హక్కు ఉంటే నష్టపరిహారం ఇవ్వనిదే వారిని తొలగించడానికి వీలులేదని కోర్టు అంటుంది. చట్టపరమైన హక్కు లేకపోతే నేనేం చేయలేనంటుంది.

సంప్రదాయమైన ఈ అవగాహనను ఆ తరువాత న్యాయస్థానాలు కొంత సవరించాయి. ప్రభుత్వం తప్పుడు కారణాల వల్ల (ఉదాహరణకు బోట్ఓనర్ల దగ్గర లంచం తీసుకోవడం వల్ల)గానీ మత్స్యపరిశ్రమ అభివృద్ధితో ఏమీ సంబంధంలేని కారణాలవల్ల (ఉదాహరణకు బోట్ఓనర్ల సంఘం అధ్యక్షుడు ముఖ్యమంత్రి బావమరిది కావడం వల్ల)గానీ ఆ నిర్ణయం తీసుకొని ఉంటే కోర్టులు జోక్యం చేసుకుంటాయి. అంతేకాదు, ఏ కారణాలు చెప్పి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో ఆ కారణాలకు అసలే ఆధారం లేకపోయినా, అందుకు విరుద్ధమైన ఆధారాలను లెక్కలోకి తీసుకోకుండా నిర్ణయం చేసినా, చెప్పిన కారణాలకూ చేసిన నిర్ణయానికీ పొంతన ఏమీ లేకపోయినా కోర్టులు జోక్యం చేసుకుంటాయి. ఉదాహరణకు అక్కడ సముద్రంలో రొయ్యలే లేవనుకోండి. లేకపోతే అక్కడ సముద్రంలో అప్పటికే కాలుష్యం ఎక్కువ ఉండడం వల్ల డీజల్, లేక పెట్రోల్ ఉపయోగించే మోటార్ బోట్లు ఆ నీటిలో తిరగడం హానికరమనుకోండి. అటువంటప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయి.

ఇంకొకరకంగా చెప్పాలంటే, ప్రభుత్వ నిర్ణయాలు ఏ చట్టానికీ విరుద్ధంగా ఉండకుండా చూడడం, నిర్ణయాలు తీసుకునే పద్ధతి సక్రమంగా ఉండేటట్టు చూడడం న్యాయస్థానాల బాధ్యత. ఆ రెండు హద్దులకూ లోబడి ఉన్నంతకాలం ఆ నిర్ణయాల వల్ల ఎవరికి మేలు జరుగుతుంది, ఎవరికి నష్టం జరుగుతుంది అని కోర్టులు చూడవు. విధాననిర్ణయాలు చట్టబద్ధమైనవేనా, వాటిని సక్రమంగా తీసుకున్నారా అని కోర్టులు చూస్తాయే తప్ప ఆ నిర్ణయాల దిశ ఏమిటి, వాటి సామాజిక స్వభావం ఏమిటి అని కోర్టులు చూడలేవు.

ఒకరకంగా ఇది సహేతుకమైన అవగాహనే. విధాననిర్ణయాలు న్యాయస్థానాలు చేయడం కంటే ప్రభుత్వాలు చేయడమే మేలు. న్యాయస్థానాలు ప్రజావ్యతిరేక నిర్ణయాలు చేయడం మొదలుపెడితే ప్రజలేమీ చేయలేరు. ప్రభుత్వాలనైతే ఎన్నికలలో ఓడించవచ్చు. ఆందోళనల ద్వారా ఒత్తిడి పెట్టవచ్చు.

అయినప్పటికీ మన రాజ్యాంగం ఇంకొంత విశాలమైన బాధ్యతను న్యాయస్థానాలపైన పెట్టింది. మన రాజ్యాంగంలో ప్రభుత్వ బాధ్యతలు, ప్రజల హక్కులు మాత్రమేకాక దేశానికొక గమ్యాన్నీ ప్రభుత్వ విధానాలకొక దిశనూ నిర్దేశించే ఆదేశాలున్నాయి, పీఠిక ఉంది. అవి హక్కుల రూపంలో లేవు కాబట్టి న్యాయస్థానాలు వాటిని లెక్కలోకి తీసుకోలేవని ఒకప్పుడు సుప్రీంకోర్టు అనిందిగానీ ఆ తరువాత తన అభిప్రాయం కొంత మార్చుకుని, ఆదేశికసూత్రాలను ప్రాథమిక హక్కులతో జోడించి అర్థం చేసుకోవాలని అభిప్రాయపడింది. అంటే ఆదేశిక సూత్రాలను విడిగా తీసుకున్నప్పుడు వాటిని కోర్టులు అమలు చేయించజాలవుగానీ, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు ఆదేశిక సూత్రాల వెలుగులో విస్తృతమైన అర్థం ఇచ్చుకోవడం సాధ్యమైనప్పుడు న్యాయస్థానాలు ఆ విస్తృత అర్థంలో ప్రాథమిక హక్కులను అమలు చేస్తాయి.

అంతర్జాతీయ ప్రకటనలు, ఒడంబడికలలోని హక్కుల విషయం కూడా ఇంతే. ఆ ఒడంబడికపైన భారతప్రభుత్వం సంతకం చేసినప్పటికీ కోర్టులు వాటిని అమలు చేయమని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయజాలవని అంటూనే, ఆ ఒడంబడికల వెలుగులో మన

రాజ్యాంగంలోని హక్కులకు విస్తృతమైన అర్థం ఇచ్చుకోవడం సాధ్యమైనప్పుడు కోర్టులు ఈ హక్కులను ఆ విస్తృతమైన అర్థంలో అమలు చేస్తాయని మూడునాలుగేళ్లగా సుప్రీంకోర్టు అంటున్నది.

ఉదాహరణకు ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమనేది ఒక ప్రాథమిక హక్కు. ఆర్టికల్ 39(డి) ప్రకారం సమానపనికి సమానవేతనం దక్కేటట్టు చూడడం ఒక ఆదేశిక సూత్రం. ఈ వెలుగులో ఆర్టికల్ 14ను వ్యాఖ్యానించి, ఒకే పని చేస్తున్నా తక్కువ వేతనాలిస్తున్నారని కోర్టుకు వచ్చిన వారికి కోర్టు సమాన వేతనాలు ఇప్పించవచ్చునని సుప్రీంకోర్టు అనింది. అదేవిధంగా, పిల్లలందరికీ ప్రాథమిక విద్య ఉచితంగా కల్పించాలనేది ఆర్టికల్ 45లోని ఆదేశిక సూత్రం. ఆర్టికల్ 21లోని జీవించేహక్కును సుప్రీంకోర్టు ఈ వెలుగులో వ్యాఖ్యానించి కనీసం ప్రాథమిక విద్యలేని జీవితం జీవితమేకాదు కాబట్టి ప్రాథమిక విద్యకూడా ఆర్టికల్ 21లోని జీవించే హక్కులో భాగమేననింది.

## వెనక్కి వెళుతున్న కోర్టులు

1980ల తరువాత సుప్రీంకోర్టు ప్రారంభించిన ఈ వరవడికి ఇప్పటికింకా ఒక స్పష్టమైన రూపం రాలేదు. విధానరచన ప్రభుత్వాల పనే తప్ప కోర్టుల పని కాదని ఒప్పుకుంటూ కూడా ఆ విధాన రచన చట్టబద్ధంగా ఉందా లేదా అని చూసేటప్పుడూ ఆ నిర్ణయం సరయిన పద్ధతిలో తీసుకున్నారా లేదా అని చూసేటప్పుడూ రాజ్యాంగ ఆదేశికసూత్రాల వెలుగులో ఆ పరిశీలన జరపాలన్న కచ్చితమైన సూత్రీకరణ ఇప్పటివరకు సుప్రీంకోర్టు చేయలేదు. ఒకసారి అవునని, ఒకసారికాదని ఊగిసలాట ప్రదర్శిస్తున్నది. ముఖ్యంగా, గ్లోబలైజేషన్ విధానాలు మొదలయిన తరువాత 'విధానరచన ప్రభుత్వం పనే తప్ప మా పని కాదు. మేము కేవలం ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధమా కాదా, సక్రమంగా జరిగిందా లేదా అని చూస్తాం' అనే పాత అభిప్రాయానికి కోర్టులు వెనక్కిపోతున్నాయి.

దురదృష్టమేమిటంటే మన న్యాయస్థానాలు న్యాయసిద్ధాంత సూత్రీకరణలు చేసేటప్పుడు పాశ్చాత్య న్యాయస్థానాల సూత్రీకరణలను అనుసరిస్తున్నాయి. వాటిని అసలే పట్టించుకోవద్దని కాదు. అందులో విలువైనదేమీ లేదని కూడా కాదు. కానీ భారత రాజ్యాంగానికి ఏ పాశ్చాత్య రాజ్యాంగానికీ లేని ఒక లక్షణం ఉంది. అది కేవలం అధికారాలనూ హక్కులనూ క్రోడీకరించి ఊరుకోకుండా దేశపాలనకు ఒక దిశనూ గమ్యాన్నీ నిర్దేశించింది. దీనికి చోటు కల్పించే రాజ్యాంగ న్యాయశాస్త్రాన్ని అభివృద్ధి చేయవలసిన బాధ్యత భారతన్యాయస్థానాల మీద ఉండింది. 'చట్టంలోని ప్రతీ ఒక్క మాటకూ అర్థం కల్పించాలి' అనేది అందరూ ఆమోదించే ఒక మౌలిక న్యాయసిద్ధాంత సూత్రమే. ఎందుకంటే 'చట్టసభలు చట్టాలు చేసేటప్పుడు మాటలను వృధాగా ప్రయోగించవు' కాబట్టి. మరి భారతరాజ్యాంగం నాలుగవ అధ్యాయంలోనూ పీఠికలోనూ నిర్దేశించిన గమ్యానికి మన న్యాయ వ్యవస్థ ఏ మాత్రం అర్థం కల్పించినట్టు? సమగ్రమైన అర్థం కల్పించకపోవడం వైఫల్యం కాదా?

## విద్యుత్ కేసు పూర్వాపరాలు

ఇంక 'విద్యుత్ చార్జీల పెంపుదల' కేసు తీర్పును పరిశీలిద్దాం.

మొన్నటిదాకా రాష్ట్రవిద్యుత్‌బోర్డు విద్యుత్‌రంగానికి ఏకచ్ఛత్రాధిపతి. విద్యుత్తు ఉత్పత్తి చేసేది, సరఫరా చేసేది, పంపిణీ చేసేది బోర్డే. కరెంటు చార్జీల ధర నిర్ణయించేది బోర్డే. అయితే బోర్డుకు ఈ విషయంలో ఆదేశాలు ఇచ్చే అధికారం రాష్ట్రప్రభుత్వానికి ఉండేది. ఇప్పుడు చేపట్టిన విద్యుత్

సంస్కరణలలో భాగంగా ఉత్పత్తిని, సరఫరాను, పంపిణీని వేరు చేశారు. ఉత్పత్తి రంగంలోకి ప్రైవేట్ రంగాన్ని ఆహ్వానించి వారి ప్రవేశానికి కావలసిన సదుపాయాలు కల్పించాలని ప్రపంచబ్యాంకు మన ప్రభుత్వాన్ని ఆదేశించినప్పటికీ ప్రభుత్వరంగం అసలే ఉండకూడదని చెప్పలేదు. కాబట్టే విద్యుత్ ఉత్పత్తి రంగంలోని ప్రభుత్వ సంస్థలు కొనసాగుతున్నాయి. వాటిని ఎపిజెన్‌కో అనే కార్పొరేషన్ కిందికి తీసుకొచ్చారు. విద్యుత్ సరఫరాలో లాభాలేమీ రావు కాబట్టి దానిని ప్రభుత్వరంగంలోనే ఉండనిమ్మని ప్రపంచబ్యాంకు అనింది. విద్యుత్ సరఫరాను ఎపి ట్రాన్స్‌కో అనే కార్పొరేషన్ కిందికి తెచ్చారు. విద్యుత్‌పంపిణీని నూటికి నూరుశాతం ప్రైవేట్‌పరం చేయాలని ప్రపంచబ్యాంకు ఆదేశం. అయితే దానికి టైం పడుతుంది. కాబట్టి ఈ కథ మొదలయ్యేనాటికి దానిని ఎపిట్రాన్స్‌కో చేతిలోనే పెట్టారు. ఆ తరువాత నాలుగు ప్రాంతాలకు నాలుగు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు (డిస్‌కాంలు) ఏర్పాటు చేశారు.

విద్యుత్‌ధర నిర్ణయించే బాధ్యత మాత్రం ట్రాన్స్‌కో చేతిలోగానీ డిస్‌కాంల చేతిలోగానీ ప్రభుత్వం చేతిలోగానీ పెట్టవద్దనీ ఒక స్వతంత్రమైన విద్యుత్ నియంత్రణకమిషన్ (రెగ్యులేటరీ కమిషన్) ఆ పని చేయాలనీ ప్రపంచబ్యాంకు షరతు పెట్టింది. దీని కోసం ఒక చట్టం చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని అనుసరించి రాష్ట్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం చేసింది. దాని కింద విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను నెలకొల్పింది.

2000 సంవత్సరం ఏప్రిల్ 6వ తేదీన ఎపిట్రాన్స్‌కో తన ఆదాయవ్యయాల పద్దును రెగ్యులేటరీ కమిషన్‌కు సమర్పించి, విద్యుత్ చార్జీలు నిర్ణయించమని అడిగింది. నిజానికి అప్పటికే (ఏప్రిల్ 1వ తేదీననే) విద్యుత్ పంపిణీకోసం డిస్కాంలు ఏర్పడ్డాయి. పంపిణీకి సంబంధించిన ఆస్తులన్నీ ట్రాన్స్‌కో నుండి డిస్కాంలకు బదలాయించబడ్డాయి. కాబట్టి విద్యుత్‌చార్జీలు నిర్ణయించమని రెగ్యులేటరీ కమిషన్‌కు అప్లికేషన్ పెట్టవలసింది ఆయాప్రాంతాలలో పంపిణీ బాధ్యత చేపట్టిన డిస్కాంలేతప్ప ట్రాన్స్‌కో కాదు. కోర్టు ముందు పిటిషనర్లు లేవదీసిన అభ్యంతరాలలో ఈ సాంకేతిక అభ్యంతరం కూడా ఒకటి.

ఏమయితేనేం, ఎపి ట్రాన్స్‌కో నుండి ప్రతిపాదనలు స్వీకరించిన కమిషన్ ప్రజల నుండి అభ్యంతరాలు కోరింది. బహిరంగ విచారణ జరిపి విద్యుత్ చార్జీలను ఏ మేరకు పెంచాలో నిర్ణయించి ఏప్రిల్ 27న ఆర్డర్ జారీ చేసింది.

ఈ ఆర్డర్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో కేసు వేసిన వారు తమ సవాలుకు కొన్ని నిర్దిష్టమైన కారణాలు చూపించారు.

(అ) ట్రాన్స్‌కో ప్రతిపాదనలనూ ఇతరుల అభ్యంతరాలనూ స్వతంత్రంగా పరిశీలించినట్లు చేసి రెగ్యులేటరీ కమిషన్ జారీ చేసిన ఆర్డర్ నిజానికి 1999 జనవరి 31న రాష్ట్రప్రభుత్వానికీ ప్రపంచ బ్యాంకుకూ జరిగిన ఒప్పందానికి నకలే. చట్టం ప్రకారం స్వతంత్రంగా వ్యవహరించి న్యాయ సమ్మతంగా నిర్ణయం చేయవలసిన రెగ్యులేటరీ కమిషన్, అంతకు ముందే జరిగిన ఒప్పందానికి తన నిర్ణయం రూపం ఇవ్వడం చట్టవిరుద్ధమే కాక చట్టాన్ని అపహాస్యం చేయడం కూడా.

(ఆ) రెగ్యులేటరీ కమిషన్‌కు విద్యుత్ కొనుగోలు నుండి పంపిణీ దాకా అన్ని విషయాలనూ నియంత్రించే అధికారం ఉంది. కరెంటు సరఫరా చేసే కంపెనీలకు లైసెన్స్ ఈ కమిషన్ ఇస్తుంది. సరఫరా చేసే పద్ధతిని పర్యవేక్షిస్తుంది. సరఫరా చేసే లైసెన్స్ పొందిన కంపెనీలు విద్యుదుత్పత్తి కంపెనీల వద్ద చేసే కొనుగోలును కూడా పర్యవేక్షించే హక్కు కమిషన్‌కు ఉంది. ఆ కొనుగోలులో

పొదుపు పాటించాలనీ కొనుగోలు ఒప్పందాలు పారదర్శకంగా ఉండాలనీ ఆదేశించే అధికారం కమిషన్‌కు ఉంది. ఆ సరఫరా కంపెనీ, లేక దాని నుండి కరెంటు కొనుక్కునే పంపిణీ కంపెనీ, వినియోగదారులకు ఏ రేటుకు కరెంటు అమ్మవచ్చునో నిర్ణయించే అధికారమూ ఉంది. ఈ అధికారాలను విడివిడిగా చూడడానికి వీలులేదు. అన్నిటినీ కలిపి నిర్వర్తించినప్పుడే కమిషన్ తన విధి చట్టబద్ధంగా నిర్వర్తించినట్టు. అయితే ఎపి ట్రాన్స్‌కో ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థలతో చేసుకున్న కొనుగోలు ఒప్పందాలను కమిషన్ అసలే పరిశీలించకుండా ట్రాన్స్‌కో మనకు కరెంటు విక్రయించే ధరను మాత్రం నిర్ణయించింది. అది చట్టవిరుద్ధం.

కొనుగోలు ఒప్పందాలను పరిశీలించకపోవడం వల్ల ట్రాన్స్‌కో ఎంత అహేతుకమైన ధరలకు కరెంటు కొనుక్కోవడానికి ఒప్పందం చేసుకుందో కమిషన్ చూడలేదు. ఒక యూనిట్ కరెంటు జెన్‌కో నుండి రూ.1.42 పైసలకు, కేంద్రప్రభుత్వ సంస్థల నుండి రూ.1.64 పైసలకు, పొరుగు రాష్ట్రాల విద్యుత్ బోర్డుల నుండి రూ.2.05పైసలకు కొనుగోలు చేస్తుండగా, ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థల నుండి సగటున యూనిట్ రూ.3.05 పైసలకు కొనడానికి ఒప్పందాలు చేసుకోవడమేకాక వాళ్ళు ఎంత ఉత్పత్తి చేస్తే అంతా కొంటామని 'కౌంటర్‌గ్యారంటీ' ఇచ్చింది.

(ఇ) 1 బిలియన్ డాలర్ల అప్పుకోసం రాష్ట్రప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఈ ఒప్పందం ద్వారా తన సార్వభౌమ అధికారాన్ని ఒక పరాయిశక్తికి అప్పగించింది. అది రాజ్యాంగవిరుద్ధం, చట్ట విరుద్ధం.

(ఈ) ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం కరెంటు పంపిణీలో సబ్సిడీనీ క్రాస్ - సబ్సిడీనీ పూర్తిగా తొలగించడానికి అంగీకరించింది. ఒక్కొక్క సందర్భంలో సబ్సిడీ ఇవ్వడం, ఇవ్వకపోవడం ప్రభుత్వ విచక్షణకు సంబంధించిన విషయమే కావచ్చుగానీ అసలే సబ్సిడీ ఇవ్వబోమని ఒప్పందం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధం. అభివృద్ధి ఫలితమైన సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై సమాజం సమష్టి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూసుకోవాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 అంటుంది. ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం దానికి విరుద్ధం.

(ఉ) రెగ్యులేటరీ కమిషన్‌ను నెలకొల్పింది ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం కింద. రాష్ట్ర అసెంబ్లీ చేసిన ఈ చట్టాన్ని 26.10.1998న గెజెట్‌లో ప్రచురించారు. అప్పటికే అదే విషయంపైన కేంద్రం (పార్లమెంటు) 1998 జూలై నెలలో జారీ చేసిన విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ల చట్టం అమలులో ఉంది కాబట్టి రాష్ట్రపతి అనుమతి పొందితే తప్ప అదే విషయం పైన చేసిన రాష్ట్రచట్టం చెల్లుబాటు కాదు. ఆ అనుమతిని రాష్ట్రప్రభుత్వం రాష్ట్రపతి నుండి పొందిందిగానీ, పొందేటప్పుడు ప్రపంచబ్యాంకుతో తాను అప్పటికే ఒక ఒప్పందం చేసుకొని ఉన్నాననీ అందుకే ఈ చట్టం చేయవలసి వచ్చిందనీ రాష్ట్రపతికి తెలియజేయలేదు. అందువల్ల రాష్ట్రచట్టం చెల్లదు, దాని కింద జారీ చేసిన రెగ్యులేటరీ కమిషన్ ఆర్డర్ చెల్లదు.

(ఊ) అధికారం ఉన్నవాళ్లు చేసే ఏ నిర్ణయమైనా కచ్చితమైన సమాచారంపైన ఆధారపడి ఉండాలి. కచ్చితమైన సమాచారం ఉన్నట్టయితే ఆ సమాచారం ఆధారంగా వారు ఏ నిర్ణయం తీసుకుంటారనేది వారి విచక్షణకు సంబంధించిన విషయం కావచ్చు. దానిలో కోర్టులు జోక్యం చేసుకోకపోవచ్చు. కానీ కచ్చితమైన సమాచారం లేకుండా తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులు తప్పుపట్టవలసి ఉంటుంది.

విద్యుత్‌నియంత్రణ కమిషన్ ముందు ఎపి ట్రాన్స్‌కో పెట్టిన సమాచారం చాలా లోపభూయిష్టమయింది. ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో ఎంతభాగం ఏ రకమైన వినియోగదార్లు వాడుకుంటున్నారు, ఎంతభాగం దొంగతనానికి గురి అవుతున్నది అనే విషయాలు తెలియకుండా కరెంటు చార్జీల గురించి కమిషన్ సరయిన నిర్ణయం చేయజాలదు. మరి ఆ గణాంకాలు ట్రాన్స్‌కో కచ్చితంగా చెప్పగలిగిందా? ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో 41శాతం మాత్రమే మీటర్ల గుండా పోతుంది. అందులో ఎంతభాగం ఏ వర్గానికి చెందిన వినియోగదార్లు వాడుకుంటున్నారో ట్రాన్స్‌కో చెప్పగలదు. తక్కిన 59శాం గురించి ఏమీ చెప్పలేకపోగా, అసంబద్ధమైన సమాచారం అందిచ్చింది. నాలుగేళ్ల కిందటి వరకు మీటర్లకు అందని కరెంటులో దాదాపు 43 శాతం వ్యవసాయరంగానికి పోతున్నదనీ మిగిలినది మాత్రమే సరఫరా పంపిణీల నష్టం వాటా అనీ అనేవారు. 1995-96 తరువాత ఈ గణాంకాలు అకస్మాత్తుగా తారుమారయ్యాయి. వ్యవసాయరంగం వాటాను అకస్మాత్తుగా తక్కువ చేసి చూపించడం, సరఫరా పంపిణీల నష్టం వాటాను బాగా ఎక్కువ చేసి చూపించడం మొదలయింది. 1991-92లో సరఫరా, పంపిణీ నష్టం వాటా 19.3 శాతం అన్నారు. 1992-93లో 19.16 శాతం, 1993-94లో 19.05శాతం, 1994-95లో 18.94 శాతం, 1995-96లో 18.9శాతం అన్నారు. కానీ 1996-97లో దానిని అకస్మాత్తుగా 32.04 శాతంకు పెంచారు. 1998-99లో 38 శాతం అన్నారు. సరఫరా, పంపిణీల నష్టం 1996-97 నుండి అకస్మాత్తుగా ఎక్కువ చూపించారంటే అర్థం అదే సంవత్సరం నుండి వ్యవసాయరంగానికి సరఫరా చేసే కరెంటు వాటాను అదే మోతాదులో తగ్గించి చూపించడం మొదలుపెట్టారని. (40శాతం పై చిలుకు నుండి 20 శాతం లోపు).

ఇంత అసంగతంగా ఉన్న గణాంకాలను ఆధారం చేసుకున్న విద్యుత్ నియంత్రణ కమిషన్ హేతుబద్ధమైన నిర్ణయం ఏదైనా చేయగలదా? చేసిన నిర్ణయాన్ని హేతుబద్ధమైనదిగా ఆమోదించవచ్చునా?

(ఎ) ధరలు నిర్ణయించే అధికారం ఉన్న అధికారిగానీ కమిషన్‌గానీ ధర ఎంత నిర్ణయిస్తుందనే విషయంలో కోర్టులు జోక్యం చేసుకోలేకపోవచ్చునుగానీ, నిర్ణయించిన ధర మరీ అన్యాయంగా ఉంటే ఆ నిర్ణయం మరలా చేయమని పురమాయించవచ్చును. ట్రాన్స్‌కో ఒప్పుకోలు ప్రకారమే తన ద్వారా సరఫరా అయ్యే కరెంటులో 38 శాతం మీటర్లకు అందకుండా (అంటే బిల్లులకు అందకుండా) సరఫరా, పంపిణీల క్రమంలో నష్టమవుతున్నది. ఈ అసమర్థతను పోగొట్టుకునే ప్రయత్నమేదీ ట్రాన్స్‌కో చేస్తున్న దాఖలాలు లేవు. కాగా, ఈ నష్టాన్నంతా తన ఖర్చులో చూపించి, బిల్లులు చెల్లించే పౌరులపైన ఆ భారాన్ని వేయమంటే కిమ్మనకుండా రెగ్యులేటరీ కమిషన్ ఆ పని చేసింది. ఇంత అన్యాయమైన రేట్ల నిర్ణయాన్ని కోర్టు ఒప్పుకుంటుందా?

ఇంకా చాలా విషయాలు కేసు విచారణ సందర్భంగా చర్చకు వచ్చాయి. కానీ ముఖ్యమైనవి ఇవే.

ఈ అభ్యంతరాలకు ప్రాతిపదిక 1999 జనవరి 31న ప్రపంచబ్యాంకు వెలువరించిన 'ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగ సంస్కరణ ప్రాజెక్ట్' అనే విధానపత్రం. అది ఒక ఒప్పందం, లేక ఒడంబడిక రూపంలో ఉంది. 'ఈ ప్రాజెక్టులోని సంస్కరణలు, పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం రెండేళ్ల నాడు మొదలయింది. ఒక సంవత్సరం కాలంగా వేగం పుంజుకుంది' అనీ 'ఈ ప్రాజెక్టుకు వర్తించే ప్రపంచబ్యాంకు విధానాలన్నిటికీ ఇది లోబడి ఉంది' అనీ ఈ పత్రం చివరి నాలుగు వాక్యాలు చెప్తాయి. అంటే లిఖితరూపంలో ఒప్పందం లేక విధానపత్రం రాసుకున్నది 1999 జనవరి 31వ తేదీన కాగా 1997 నుండే ఇరుపక్షాల సమ్మతితో అది అమలవుతున్నది.

ఆ విధానపత్రంలోని ప్రధాన అంశం ప్రపంచబ్యాంకు మన రాష్ట్రప్రభుత్వానికి విద్యుత్ సంస్కరణల నిమిత్తం 1 బలియన్ డాలర్లు (అప్పటి మారకపు విలువలో 4300 కోట్ల రూపాయలు) అప్పుగా ఇవ్వడానికి అంగీకరించడం. ఆ అప్పు 5 వాయిదాలలో ఇవ్వడం జరుగుతుంది. ఆ అప్పుకు ప్రపంచబ్యాంకు విధించిన షరతులను పత్రంలో వివరంగా రాశారు. ఈ షరతుల అమలుకు ఒక టైంటేబుల్ కూడా నిర్దేశించారు. ఎప్పటికప్పుడు ఆ టైంటేబుల్ ప్రకారం షరతులను అమలు చేస్తేనే మిగిలిన అప్పు లభిస్తుంది.

## ఆ షరతులేమిటి?

1. రాష్ట్రవిద్యుత్ బోర్డును మూడుగా విడగొట్టాలి. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ అనే మూడు రంగాలు వేరువేరుగా ఉండాలి. ఈ రంగాలలో ప్రభుత్వం ఒకవేళ కొనసాగినా అది ప్రభుత్వ శాఖగా కాక ఒక పబ్లిక్ సెక్టర్ కార్పొరేషన్ రూపంలో ఉండాలి. ట్రాన్స్కో, జెన్కోల ఏర్పాటుతో ఇది అప్పటికే మొదలయిందని ప్రపంచబ్యాంకు గుర్తించింది.

2. విద్యుత్తును ఉత్పత్తిదార్ల నుండి కొనుగోలు చేసే ప్రక్రియను, సరఫరాను, పంపిణీనీ నియంత్రించే ఒక స్వతంత్రమైన నియంత్రణ వ్యవస్థను నెలకొల్పాలి. అది ఒక చట్టం ద్వారా జరగాలి. ఈ పని కూడా విద్యుత్ నియంత్రణ కమిషన్ను నెలకొల్పడం ద్వారా రాష్ట్రప్రభుత్వం అప్పటికే చేసేసిందని ప్రపంచబ్యాంకు గుర్తించింది.

నిజానికి రాష్ట్రం ఆ చట్టాన్ని (ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం) చేయకముందే కేంద్రం (పార్లమెంటు) విద్యుత్ నియంత్రణ కమిషన్ల (రెగ్యులేటరీ కమిషన్స్) చట్టం చేసిందని పైన చూశాము. అందులోనే ప్రతీరాష్ట్రమూ ఒక రాష్ట్రస్థాయి నియంత్రణ కమిషన్ను నెలకొల్పవచ్చునని అన్నారు. ఆ అవకాశాన్ని వినియోగించుకొని రాష్ట్రప్రభుత్వం కొత్త చట్టమేదీ అవసరం లేకుండానే నియంత్రణ కమిషన్ను ఏర్పాటు చేసి ఉండవచ్చును. అయినప్పటికీ ఒక ప్రత్యేకచట్టం చేయడం వెనుక ప్రపంచబ్యాంకు సలహా లేక సూచన ఉందనేది స్పష్టమే. కానీ పార్లమెంటు ఒక విషయంలో చట్టం చేసి ఉన్నప్పుడు అదేవిషయంలో ఒక రాష్ట్ర అసెంబ్లీ కూడా చట్టం చేసినట్టయితే, ఆర్టికల్ 254(2) కింద దానికి రాష్ట్రపతి ఆమోదం పొందితే తప్ప అసెంబ్లీ చేసిన చట్టం చెల్లదు. ఆ ఆమోదం మన ప్రభుత్వం పొందిందిగానీ, ప్రపంచబ్యాంకుతో తాను చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్రపతికి చెప్పి ఆమోదం పొందిందా? హైకోర్టు పిటిషనర్లు వేసిన ప్రశ్నలలో ఇదొకటని పైన చూశాము.

3. విద్యుత్ చార్జీలను నిర్ణయించే బాధ్యత విద్యుత్ నియంత్రణ కమిషన్ చేపడుతుంది. విద్యుత్ పంపిణీ చేసే కంపెనీలు తమ ఆదాయ అవసరాలను (revenue requirements) కమిషన్కు సకాలంలో సమర్పించి అందుకు తగిన చార్జీల పెంపుదలను కోరాలి. వారి ప్రతిపాదన ఈ పునర్వ్యవస్థీకరణ పత్రంలో సూచించిన దానికంటే తక్కువ ఉండడానికి వీలులేదు. అంతేకాక అది ప్రపంచబ్యాంకుకు సంతృప్తికరంగా ఉండాలి.

ఈ పునర్వ్యవస్థీకరణ పత్రం సూచించే పెంపుదల ఎంత? 2001లోనూ 2002లోనూ 15 శాతం, ఆపైన 2007 దాకా ప్రతీ సంవత్సరం 12 శాతం. ఇంతగానీ ఇంతకంటే ఎక్కువగానీ పెంపుదల కోరుతూ ఎ.పి.ట్రాన్స్కో (రాబోయే రోజులలో డిస్కాంలు) నియంత్రణ కమిషన్ ముందు ప్రతిపాదనలు పెట్టాలి. ప్రతిపాదనలు ఈ కనీస పరిమాణాన్ని పాటించడమేకాక ప్రపంచబ్యాంకుకు సంతృప్తినిచ్చేవిగా ఉండాలి.

కానీ ఆం.ప్ర.విద్యుత్ సంస్కరణల చట్టం సెక్షన్ 26(1)లో ఏమంటుందంటే పంపిణీ కంపెనీలు తమ ఆదాయ అవసరాలను నియంత్రణ కమిషన్ ప్రకటించే నియమాల ననుసరించి అంచనా వేయాలని. మరి ఈ రెండు ఆదేశాలలో దేనిని పాటించాలి? చట్టం చెప్పినట్టు నియంత్రణ కమిషన్ జారీ చేసిన నియమాలను అనుసరించాలా? ప్రపంచబ్యాంకుతో రాష్ట్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని అనుసరించాలా?

మొదటిది చేస్తున్నట్టు కనిపిస్తూ రెండవది చేశారనీ, స్వతంత్రంగా చార్జీల నిర్ణయం చేస్తున్నట్టు చూపిస్తూ అప్పటికే ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేశారనీ పిటిషనర్ల అభియోగం. ఇది చట్టాన్ని అపహాస్యం చేయడమేనని వారి ఆరోపణ.

4. ప్రపంచబ్యాంకు ఇచ్చే 1 బిలియన్ డాలర్ల (4300 కోట్ల రూపాయల) అప్పు ఒక్కసారిగా ముట్టజెప్పదు. వాయిదాల పద్ధతిలో ఇస్తుంది. ఎప్పటికప్పుడు సంస్కరణల అమలును పరిశీలించి ఇస్తుంది. దానికి కొన్ని మైలురాళ్లను ఈ ఒప్పందంలో రాసుకున్నారు. ఆ తేదీకి ఆ మైలురాయిని అందుకున్నట్టయితేనే మిగిలిన అప్పు ముడుతుంది. అందులో ముఖ్యమైనవి.

| | 1999 | 2002 | 2007 |
|---|---|---|---|
| కరెంటు తలసరి వినియోగం (యూనిట్లు) | 410 | 640 | 890 |
| జెన్‌కో, ట్రాన్స్‌కోల లాభాల రేటు | - | 16% | 16% |
| పంపిణీ, సరఫరా నష్టాలు | 32.7% | 26.4% | 17.7% |
| విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేట్‌రంగం వాటా | 6% | 12% | 35% |
| విద్యుత్ పంపిణీలో ప్రైవట్‌రంగం వాటా | 0 | 30% | 90-100% |
| విద్యుత్ రంగంలో సబ్సిడీల వాటా | 35% | 11% | 0 |
| విద్యుత్ అందుబాట్లో ఉండే జనాభా | 50% | 55% | 62% |

కరెంటు చార్జీలు 2001, 2002లలో 15శాతం చొప్పున పెరగాలనీ ఆ తరువాత 2007దాకా 12శాతం చొప్పున పెరగాలనీ మరొక నియమం ఉందని పైన చూశాము. ఆ నియమాన్ని కూడా ఈ మైలురాళ్లలో భాగంగా చూడాలి.

ఈ నియమాలలో తారీఖులు, అంకెలు చాలా కచ్చితంగా ఉండడం గమనించాలి. ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం రెగ్యులేటరీ (నియంత్రణ) కమిషన్‌కు, ప్రభుత్వానికీ ఇచ్చిన అధికారాలకు ఇంక చోటేమీ మిగలదు. అయినప్పటికీ నియంత్రణ కమిషన్ స్వతంత్రమైన పారదర్శకమైన విచారణ జరిపినట్టు చూపించి ఈ ఒప్పందానికి లోబడి ఆర్డర్లు జారీ చేయడం చట్టాన్ని అపహాస్యం చేయడం కాదా అన్న ప్రశ్న ఇప్పటికే వేసుకున్నాం.

ఈ షరతుల పర్యవసానాన్ని కూడా చూడాలి. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ అనే మూడు పనులలో మూడవదాన్ని 2007 నాటికి పూర్తిగా ప్రైవేటీకరణ చేయాలన్న నియమాన్ని తీసుకుందాం. మన ఇళ్లకు (అంగళ్లకు, బావులకు, కార్ఖానాలకు) కరెంటును చేరవేసేది ఈ పంపిణీ వ్యవస్థే. సమీపంలో ట్రాన్స్‌కోవారు నెలకొల్పిన సబ్‌స్టేషన్ నుండి కరెంటు తీసుకుని మన ఇంటిదాకా లైన్ వేసి మనకు కరెంటు అమ్మి ఆ డబ్బుతో అది లాభాలు సంపాదించుకోవాలి. మనం ఆదివాసీలమయితే, ఎక్కడో అడవిలో 10 ఇళ్ల గుంపులో బతుకుతున్నట్టయితే, మనకు కరెంటు పంపిణీ చేయడం ఏ ప్రైవేట్ కంపెనీకి లాభదాయకంగా ఉంటుంది? ఆదివాసీలదాకా పోనక్కరలేదు అనంతపురం, మహబూబ్‌నగర్ వంటి కరువు జిల్లాలలో విసిరేసినట్టు దూరదూరాన పడి ఉన్న చిన్న చిన్న

గ్రామాలుంటాయి. వారికి దూరం నుండి కరెంటు తీసుకుపోయి పంపిణీ చేయడం ఏ ప్రైవేట్ సంస్థకు లాభదాయకంగా ఉంటుంది?

ప్రభుత్వం సబ్సిడీ ఇస్తే ఉంటుందేమోగానీ 1999లో 35% ఉన్న సబ్సిడీ 2002 నాటికి 11%కు తగ్గాలని 2007 నాటికి మొత్తంగా తీసెయ్యాలనీ ఈ షరతులే చెపుతున్నాయి. అంటే ఆ ప్రజలు కరెంటు లేకుండా బతకవలసిందే కదా?

ఇదంతా నిజమే కావచ్చునుగానీ కోర్టులు ఏం చేయగలవు? అంటారేమో. ఇది ప్రభుత్వ విధానాలకు సంబంధించిన విషయం కాబట్టి కోర్టులేం చేయలేవు అనవచ్చు.

## అవకాశం ఉండీ జోక్యం చేసుకోని కోర్టులు

రెండు కోణాల నుండి కోర్టులు జోక్యం చేసుకునే అవకాశం ఉంది. ప్రపంచబ్యాంకు నిర్దేశించిన 'మైలురాళ్ల'లోనే అసంబద్ధత ఉంది. ఒక పక్క మారుమూల బతికే ప్రజలకింక కరెంటు దక్కే అవకాశం లేకుండా చేసే నియమాలు పెడుతూ ఇంకొక పక్క కరెంటు అందుబాట్లో ఉండే జనాభా నిష్పత్తి 50% నుండి 55%కు, ఆపైన 62%కు పెరగాలని అనడం అహేతుకం. అహేతుకమైన లక్ష్యాలతో రూపొందించుకున్న ప్రభుత్వ విధానాలనుగానీ చర్యలనుగానీ కోర్టులు కొట్టేయవచ్చు.

రెండవదేమిటంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో చెప్పే 'జీవించేహక్కు'కు సుప్రీంకోర్టు ఇప్పటికే చాలా విస్తృతమైన అర్థాన్ని కల్పించి ఉంది. శుభ్రమైన పర్యావరణం, జీవనాధారమైన ఆదాయవనరులు, ప్రాథమిక విద్య, కనీస వైద్యసదుపాయం మొదలయినవి జీవించేహక్కులో భాగమనింది. విద్యుత్ సదుపాయం కూడా ఈనాటి పరిస్థితులలో 'జీవితం'లో భాగమేనని సూత్రీకరించడంలో ఇబ్బందేమీ ఉండకూడదు. ఎవరు ఎంత కరెంటు వాడుకోగలరనేది వారి ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి ఉండవచ్చు. రోజుకు ఎన్ని గంటల కరెంటు లభిస్తుందనేది విద్యుత్ పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి ఉండవచ్చు. ఈ విషయాలలో కోర్టులు ఏ మేరకు జోక్యం చేసుకోగలవన్నది వివాదాస్పదం కావచ్చు. కానీ మారుమూలన ఉన్న కారణంగా కొన్ని ఆవాసాలకు మొత్తంగానే విద్యుత్ వ్యవస్థ చేరని పరిస్థితి కల్పిస్తే అది జీవించేహక్కుకు భంగకరమని సూత్రీకరించడంలో ఇబ్బందేమీ ఉండకూడదు.

రాష్ట్రప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని 2007 నాటికి పూర్తిగా తొలగించాలన్న షరతును చూశాము. అదేకాదు, 'క్రాస్-సబ్సిడీ'ని కూడా క్రమంగా తొలగించివేయాలన్నది ప్రపంచబ్యాంకు నియమం.

సబ్సిడీలలో రెండు రకాలుంటాయి. ఒకటి, ప్రభుత్వం తన ఖజానా నుండి ఇచ్చేది. రెండు, వినియోగదారులలో ధనవంతులైన వారి నుండి ఎక్కువ వసూలు చేసి పేదల దగ్గర తక్కువ వసూలు చేయడం ద్వారా కల్పించే సబ్సిడీ. ఇది ధనవంతులైన వినియోగదార్ల నుండి పేదలకు సబ్సిడీ ఇప్పించే పద్ధతి. దీనిని క్రాస్ -సబ్సిడీ అంటారు. అభివృద్ధి ఫలితమైన సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకూడదని చెప్పే ఆర్టికల్ 39(సి)లోని ఆదేశిక సూత్రానికి అనుగుణ్యమైన పద్ధతి ఇది.

అది ఆదేశికసూత్రమే కాబట్టి క్రాస్ సబ్సిడీ ఇయ్యవలసిందేనని న్యాయస్థానాలు ప్రభుత్వానికి ఆదేశం జారీ చేయలేకపోవచ్చు. కానీ ఇస్తున్న క్రాస్‌సబ్సిడీని తీసెయ్యాలన్న నిర్ణయం తీసుకున్నట్టయితే దానికి హేతుబద్ధమైన కారణం చూపించవలసి ఉంటుంది. న్యాయస్థానాలు చూపించమని అడగవలసి ఉంటుంది.

నిజానికి ఈ అభ్యంతరం మొత్తంగానే విద్యుత్ సంస్కరణలకు వర్తిస్తుంది. ఇప్పటి దాకా ఉన్న

విద్యుత్ వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా అది పేదవర్గాలకు రైతాంగానికీ చవకగా కరెంటు ఇచ్చేది, కరెంటు పంపిణీ లాభదాయకంకాని మారుమూల ఆవాసాలకు కూడా సరఫరా చేసేది. ఆ వ్యవస్థ ఆ మేరకు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు అనుగుణమైన వ్యవస్థ. దాని నుండి వైదొలగడానికి సహేతుకమైన కారణం చూపించకపోతే అది చెల్లదని న్యాయస్థానాలు ప్రకటించవలసి ఉంటుంది.

చంద్రబాబు ప్రభుత్వం చూపించిన కారణమేమిటి? 1997లోనే ఈ కారణాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాబోయే రోజులలో రాష్ట్రం ఆర్థికంగా చాలా అభివృద్ధి చెందబోతుంది. దానికి తగినంత కరెంటు మనం ఉత్పత్తి చేసుకోవాలి. అప్పటికి రాష్ట్రంలో నెలకొల్పిన విద్యుదుత్పత్తి సామర్థ్యం 6110 మెగావాట్లుకాగా, రాబోయే అయిదేళ్లలో ఇంకొక 8500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పవలసి ఉంటుంది. అయితే దానికి చాలా పెట్టుబడి (దాదాపు 35వేల కోట్ల రూపాయలు) కావలసి ఉంటుంది. అంతపెట్టుబడి రాష్ట్రవిద్యుత్‌బోర్డు దగ్గర లేదు కాబట్టి ప్రైవేట్ పెట్టుబడిని పెద్దమొత్తంలో (దాదాపు 25వేల కోట్ల రూపాయలు) రాష్ట్ర విద్యుత్ రంగంలోకి ఆహ్వానించవలసి ఉంటుంది. ప్రపంచబ్యాంకు నుండి కూడా పెద్ద మొత్తంలో (దాదాపు 7వేల కోట్ల రూపాయలు) అప్పు తీసుకోవలసి ఉంటుంది. కానీ ప్రైవేటు పెట్టుబడి అంత మొత్తంలో రావాలంటే సబ్సిడీలు, క్రాస్-సబ్సిడీలు, లాభదాయకంకాని సరఫరాలు మానుకోక తప్పదు. ప్రపంచబ్యాంకు అప్పియ్యాలంటే వారు చెప్పినట్టు నడుచుకోకతప్పదు.

ఇదీ రాష్ట్రప్రభుత్వం చూపించిన కారణం. కానీ మూడేళ్లు తిరిగేసరికి రాష్ట్రప్రభుత్వం తన అంచనా తప్పని ఒప్పుకుంది. 1997లో తాము ఊహించినంత వేగంగా రాష్ట్ర ఆర్థికవ్యవస్థ పెరగడం లేదనీ, ఇప్పటి అంచనాల ప్రకారం 2002నాటికి 8500 మెగావాట్ల అదనపు సామర్థ్యం అవసరముండదనీ 1500 మెగావాట్లయితే సరిపోతుందనీ అనింది. అంటే విద్యుదుత్పత్తి సామర్థ్యం 125 శాతం పెరగవలసి ఉంటుందన్న అంచనా పోయి 25శాతం పెరిగితే చాలునన్న నిర్ణయానికి వచ్చింది.

ఇదే నిజమైతే సబ్సిడీలు మొత్తంగా తొలగించడం వగైరా నిర్ణయాలకు చూపించిన కారణాలేవీ సరయినవి కావు కదా. ఈ మాత్రం పెట్టుబడి బహుశా మనమే సేకరించగలిగి ఉందుము. అటువంటప్పుడు రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు అనుగుణ్యమైన విధానం నుండి పక్కకు తొలగడాన్ని కోర్టులు తప్పుపట్టలేవా?

## హైకోర్టు ఏమనింది?

పిటిషనర్లువేసిన ప్రశ్నలు ఆవటికి గల ఆధారాలు ఏకరవు పెటటాను. ఇంక హైకోర్టు చెప్పిన జవాబేమిటో చూద్దాం.

మధ్య మన కోర్టులకు ఒకటి అలవాటయింది 'కోర్టులను రాజకీయ వేదికలుగా వాడుకోవద్దు' అంటారు. 'మమ్మల్ని రాజకీయ నిర్ణయాలు చేయమనవద్దు' అంటారు. కానీ సమస్య నేపథ్యం, లేక పూర్వరంగాన్ని వివరించే పేరు మీద ప్రభుత్వం అభిప్రాయాలను నిర్విమర్శగా ఏకరవు పెడతారు. ప్రభుత్వం అభిప్రాయాలు కూడా ఒక 'రాజకీయమే'నని మన న్యాయమూర్తులకు తోస్తున్నట్టు లేదు.

విద్యుత్ సంస్కరణల విషయంలో మన హైకోర్టు అదేపని చేసింది. పిటిషనర్ల వాదనలలోని నిజానిజాలు తేల్చడానికి, విద్యుత్ చార్జీల పెంపుదల వెనకున్న చారిత్రక నేపథ్యాన్ని చూడవలసిన

అవసరం ఉందంటూ ఆ నేపథ్యాన్ని గురించి ప్రభుత్వ న్యాయవాదులు చెప్పిన విషయాలనూ ప్రభుత్వం చెప్పగా పత్రికలు రాసిన విషయాలనూ 'సంస్కరణల'కు అనుకూలంగా వ్యాసకర్తలు, సంపాదకులు రాసిన విషయాలనూ జడ్జీలు తమ మాటలుగా వివరించారు. మొన్నటిదాకా ఉన్న విద్యుత్ వ్యవస్థలో విద్యుత్‌బోర్డుకు చార్జీలు నిర్ణయించడంలో చాలా స్వేచ్ఛ ఉండడం, బోర్డుకు ఈ విషయంలో ఆదేశాలిచ్చే అధికారం ప్రభుత్వం చేతిలో ఉండడం నిర్హేతుకమైన నిరయాలకు దారి తీసిందన్నారు. రాజకీయపార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలో కొన్ని వర్గాలకు విద్యుత్తును నిర్విచక్షణగా దానం చేశాయన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని వర్గాలకు ఈ రాయితీలు ఇయ్యగా ఆ వర్గాలు దానికి అలవాటుపడి పోయాయన్నారు. మరికొన్ని వర్గాల మీద క్రాస్-సబ్సిడీ భారం పడిందన్నారు. ఈ సబ్సిడీ భారం ఆర్థిక వ్యవస్థలోకి ద్రవ్యోల్బణం రూపంలో ప్రవేశించి అనేక వస్తువుల ధరలు పెరిగాయన్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం విద్యుత్‌బోర్డుకు ఇస్తానన్న సబ్సిడీ సకాలంలో ఇవ్వకపోవడం వల్ల బోర్డు నష్టాలలో పడింది, దాని అభివృద్ధి కుంటుపడిందన్నారు. దీనితోబాటు విద్యుత్‌చౌర్యం భయానకమైన మోతాదును చేరుకోవడం వలన విద్యుత్ సరఫరా గుణాత్మకంగా దెబ్బతినిందన్నారు, విద్యుత్ కొరత ఏర్పడిందన్నారు. అనేక పరిశ్రమలు స్వంత విద్యుత్ ఉత్పత్తి చేపట్టాయన్నారు. ముగింపుగా ఎ.పి.ట్రాన్స్‌కోనే ఉటంకిస్తూ, 'అన్ని ప్రభుత్వ సంస్థలలాగా పోను పోను మరింత అసమర్థంగా తయారయింది విద్యుత్‌బోర్డు' అన్నారు. (ప్రభుత్వరంగ సంస్థలు చాలా 'నిజాయితీ'గా తమ చేతకానితనాన్ని ఒప్పేసుకునే ముచ్చటయిన సంస్కృతి మొదలయి కొన్నేళ్లయింది).

ఈ తీర్పుక్రమంలో హైకోర్టు పిటిషనర్లకు సంప్రదాయక న్యాయశాస్త్రపాఠాలు అనేకం నేర్పింది కాబట్టి చాలా సంప్రదాయకమైన నియమమొకటి జస్టిస్ వెంకటరాంరెడ్డి, నాయక్‌గార్లకు గుర్తుచేయడం అధికప్రసంగం కాబోదు. వాదికీ ప్రతివాదికీ మధ్య జరిగిన సంవాదంలో చోటు చేసుకోని విషయమేదీ తీర్పులో ప్రస్తావించడానికి వీలులేదు. ఎందుకంటే సంప్రదాయక న్యాయశాస్త్రం ప్రకారం వాది, ప్రతివాదులలో ఒకరు లేవదీసి ఎదుటి వారి నుండి సమాధానం కోరిన విషయాల మీద మాత్రమే న్యాయస్థానం తీర్పు చెప్తుంది.

మరిపైన పేర్కొన్న 'నేపథ్యం' ఎవరి వాదనలోనూ లేదు. ఏ పరిస్థితులలో ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు చేపట్టిందనే విషయం వ్యాజ్యంలో భాగం కాదు. దానిపైన హైకోర్టు ఒక అభిప్రాయానికెట్లా వచ్చింది? ఎందుకు వచ్చింది?

అది వ్యాజ్యంలో భాగమయి ఉంటే పిటిషనర్లు చాలా విషయాలు కోర్టు దృష్టికి తీసుకువద్దురు. విద్యుత్‌బోర్డుకు లాభదాయకం కాకపోయినా 'రాజకీయలబ్ధి కోసం' కరెంటు సరఫరా చేసిన మారుమూల కుగ్రామాలలో పగలంతా గొడ్లు కాసి ఇంటాబయటా చాకిరీ చేసి రాత్రి రెండు ముక్కలు చదివి పరీక్షలు పాసయి తెల్లబట్టలు తొడుక్కున్న దళిత, ఆదివాసీ పిల్లల గురించి చెప్పుదురు. జీవితం మధ్య భాగంలో 'వయోజన విద్య' అభ్యసించిన వారి తల్లిదండ్రుల గురించి చెప్పుదురు. 'రాజకీయలబ్ధి కోసం' వ్యవసాయబావులకు కరెంటు సబ్సిడీ ఇవ్వబట్టే రాష్ట్రంలో సాగునీటి లభ్యత ఉన్న సేద్యపు భూమి గడచిన 15 సంవత్సరాలలో కొంత విస్తరించిందనీ, కొత్తగా దాదాపు 45 లక్షల ఎకరాలు కరెంటు సదుపాయం ఉన్న బావుల కింద సాగయ్యాయనీ, దీని వల్ల ఎంత లేదన్నా 15 లక్షల కుటుంబాలు రెండు పూటలా అన్నం తినగలిగాయనీ చెప్పుదురు.

ఈ ఒక్క విషయం తప్ప తక్కిన అన్ని విషయాలలోనూ హైకోర్టు పూర్తిగా సంప్రదాయబద్ధంగా వివేచించింది. 'కోర్టులు అన్ని హక్కులనూ కాపాడవు. రాజ్యాంగంలో కచ్చితంగా రాసి ఉన్న

హక్కులను మాత్రమే కాపాడుతాయి' అనింది. అది నిజమేకానీ కచ్చితంగా రాసి ఉన్న హక్కులకు ఆదేశిక సూత్రాల వెలుగులోనూ, మన ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ హక్కుల ఒడంబడికల వెలుగులోనూ విస్తృతమైన వ్యాఖ్యానం ఇచ్చుకోవచ్చునని గతంలో సుప్రీంకోర్టు చాలాసార్లు అనింది. దాని ప్రస్తావన ఎక్కడా ఈ తీర్పులో మన హైకోర్టు చేయలేదు. న్యాయస్థానాల పాత్రను సంకుచితం చేసే న్యాయసిద్ధాంత సూత్రాలను మాత్రం పదేపదే ఉటంకించారు.

రాష్ట్రప్రభుత్వం ప్రపంచబ్యాంకుకు తన సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టిందన్న వాదనలో ఒక పార్శ్వాన్ని మాత్రమే హైకోర్టు పట్టించుకుంది. మొత్తంగా విద్యుత్ సంస్కరణలకు సంబంధించిన అన్ని నిర్ణయాలూ ప్రపంచబ్యాంకు ఆదేశాలననుసరించి తీసుకున్నారని పిటిషనర్ల అభియోగం. 1 బిలియన్ డాలర్ల అప్పు కోసం తన సార్వభౌమ అధికారాన్ని ఒక పరాయి శక్తికి అప్పగించి వారు ఆదేశించిన పద్ధతిలో విద్యుత్‌రంగాన్ని సంస్కరించడం రాజ్యాంగ విరుద్ధమని వారు వాదించారు.

హైకోర్టు ఈ అభియోగాన్ని ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టానికి మాత్రమే పరిమితం చేసింది. ఈ చట్టం కూడా ప్రపంచబ్యాంకు షరతులననుసరించి రూపొందించినదే. అప్పటికే ఒక కేంద్ర చట్టం ఉన్నప్పటికీ ప్రపంచబ్యాంకు చెప్పిందని రాష్ట్రప్రభుత్వం ఈ చట్టాన్ని చేసింది. ఇది సక్రమమేనా అంటే, చట్టసభలు చట్టాలు ఎందుకు చేస్తాయన్న మీమాంస న్యాయస్థానాలు చేపట్టడానికి వీలులేదని జవాబు చెప్పింది మన హైకోర్టు. ఈ సూత్రీకరణ ముందు నుండి ఉన్నదే. ఏ వర్గానికి చెందిన ప్రజల ప్రజల సమస్యలకు ఎటువంటి పరిష్కారం చూపించాలనేది చట్టసభ చట్టసభల ఇష్టం. ఆ నిర్ణయం చట్టసభలలోని మెజారిటీలు చేస్తాయి. న్యాయవ్యవస్థ దానిపైన తీర్పు చెప్పజాలదు. పాలనా వ్యవస్థ, చట్టసభలు, కోర్టులు అనే మూడు వ్యవస్థలకు దేని అధికారాలు దానికున్నాయి. దేని పరిధి దానికుంది. ఆ చట్టసభకు ఆ విషయం పైన చట్టం చేసే అధికారం రాజ్యాంగంలో ఉందా, చేసిన చట్టం రాజ్యాంగ ప్రాథమికహక్కులకూ రాజ్యాంగంలోని ఇతర అంశాలకూ లోబడి ఉందా అని మాత్రమే కోర్టులు చూడగలవు.

ఇది ముందు నుండి ఉన్న పరిమితే. ఇక్కడ కూడా రాజ్యాంగప్రాథమిక హక్కులకు విస్తృత అర్థం ఇచ్చుకోవడం సాధ్యం కాదా అన్న ప్రశ్న వేసుకోవచ్చు. అదట్లాగుంచి, ఈ సూత్రీకరణ వెనక ఉన్న తర్కమేమిటన్న విషయం మరచిపోయి దానిని యాంత్రికంగా అన్వయించడంలో అర్థం లేదు. న్యాయశాఖ, పాలనావ్యవస్థ, చట్టసభల మధ్యన ఉండే అధికార విభజనకు ప్రాతిపదిక దేశ సార్వభౌమత్వం. ఒక సార్వభౌమదేశంగా తన వ్యవహారాలను తానే నిర్వహించుకునే సర్వసత్తాక అధికారం ఉన్న ఈ దేశం ఆ అధికార నిర్వహణ కోసం మూడు పరస్పర స్వతంత్రమైన వ్యవస్థలను రూపొందించుకుని వాటి పరిధులను నిర్ణయించే రాజ్యాంగాన్ని రాసుకుంది. ఈ ప్రాతిపదిక మీద చట్టసభల పరిధి ఏమిటి, న్యాయవ్యవస్థ పరిధి ఏమిటి అనే విభజన రేఖను నిర్ణయించిన కోర్టు తీర్పులు ఆ ప్రాతిపదికనే కాదనడమంటే రాజ్యాంగం పునాదినే తిరస్కరించడం. రాజ్యాంగం పునాది దేశసార్వభౌమత్వం. దానిని తిరస్కరించే ఏ చర్యనయినా న్యాయస్థానాలు సహించడానికి వీలులేదు.

ఒక ఉదాహరణ తీసుకుంటే మన హైకోర్టు అభిప్రాయం ఏ పరిణామాలకు దారితీయగలదో అర్థమవుతుంది. మనం ఎప్పటి నుండో వాడుకుంటున్న వేప, నిమ్మ వంటి ప్రకృతి సిద్ధమైన వస్తువులకు పేటెంటు తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్న పాశ్చాత్య క్రిమిసంహారక మందుల కంపెనీలకు వ్యతిరేకంగా మనం ఆందోళన చేస్తున్నాం. రేపు ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి వల్ల వారి 'హక్కు'ను ఆమోదిస్తూ పార్లమెంటు చట్టం చేసిందనుకోండి. పార్లమెంటుకు పేటెంట్ల విషయంలో చట్టం చేసే అధికారం ఉంది కాబట్టి, అటువంటి చట్టం చేయడానికి వీలులేదని

రాజ్యాంగంలోని 395 ఆర్టికల్స్‌లోనూ 12 షెడ్యూల్స్‌లోనూ ఎక్కడా చెప్పలేదు కాబట్టి అందులో తప్పేమీ లేదని కోర్టులంటాయా?

రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని ఒప్పుకుంటూ కూడా ఆ సవరణ 'రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చడానికి వీలులే'దని రాజ్యాంగంలో ఎక్కడా లేని షరతు సుప్రీంకోర్టు గతంలో పెట్టలేదా? ఎందుకు పెట్టింది? మనం ఏ అధికారం గురించి మాట్లాడుకున్నా రాజ్యాంగం పరిధిలో మాట్లాడుకుంటున్నాం, రాజ్యాంగం ప్రాతిపదికగా మాట్లాడుకుంటున్నాం. ఎవరికి ఏ అధికారమున్నా అది ఆ ప్రాతిపదికనే ధ్వంసం చేసే అధికారం కావడానికి వీలు లేదు. అందుకే రాజ్యాంగాన్ని సవరించే అధికారం కూడా దాని మౌలికస్వరూపాన్ని మార్చేది కాకూడదన్నారు. దేశ సార్వభౌమత్వం ఆ మౌలిక స్వరూపంలో భాగం కాదా? అంటే పాలనా వ్యవస్థ, చట్టసభలు చేసే ఏ పనులైనా ఏ చట్టాలయినా ఈ దేశపౌరుల అవసరాలు, ప్రయోజనాలు, కోరికలు, ఒత్తిడుల కారణంగా చేయాలి (మంచికైనా చెడుకైనా). అంతేకానీ పరాయి వారి నిర్బంధ షరతులకు లొంగి చేసేవి చెల్లవు అనన్కర లేదా2

దీనినే ఇంకొక కోణం నుండి చూడవచ్చు. 'రెప్రజెంటేటివ్ డెమోక్రసీ' భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలలో ఒకటని సుప్రీంకోర్టు అనింది. అంటే ప్రజలలో మెజారిటీ మద్దతు సంపాదించినవారు ప్రజల ప్రతినిధులుగా పరిపాలన చేసే ప్రజాస్వామ్యం రాజ్యాంగ మౌలిక సూత్రాలలో ఒకట ని అర్థం. ఈ దేశప్రజలు ఎన్నుకోని ప్రపంచబ్యాంకు, ప్రపంచవాణిజ్య సంస్థల వంటి వ్యవస్థలు బలవంతంగా వారి విధాన నిర్ణయాలు మనపైన రుద్దితే వాటిని మన చట్టసభలు ఆమోదించి తదనుగుణంగా చట్టాలు చేయడం ఆ మౌలిక సూత్రానికి విరుద్ధం కాదా?

ఇవి మన న్యాయస్థానాలకు కొత్త ప్రశ్నలు. కానీ ప్రస్తుత పరిస్థితులలో చాలా కీలకమైన ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు చాలా బాధ్యతగా జవాబు చెప్పవలసి ఉండింది. ఆ సంగతి గుర్తించకుండా, ఇవి పాత ప్రశ్నలే అయినట్టు హైకోర్టు పాత సమాధానాలే చెప్పి సంతృప్తి చెందడం బాధాకరం. 'ఒక చట్టం రాజ్యాంగబద్ధమా కాదా అని అడుగుతున్నామంటే ఆ చట్టసభకు ఆ విషయంలో చట్టం చేసే అధికారం రాజ్యాంగం ఇచ్చిందా లేదా అని మాత్రమే'ననే ఒక పాశ్చాత్య న్యాయసిద్ధాంతవేత్త అభిప్రాయాన్ని మన హైకోర్టు తన తీర్పులో ఒకటికి రెండుసార్లు ఉటంకించి అదే కరెక్టనింది. రాజ్యాంగాన్ని సవరించే అధికారం రాజ్యాంగమే పార్లమెంటుకు ఇచ్చినప్పటికీ అది రాజ్యాంగం స్వరూప స్వభావాలను మార్చే అధికారం కాదని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ పాశ్చాత్య మేధావి అభిప్రాయంతో జస్టిస్ వెంకట్రామిరెడ్డిగారు ఏ విధంగా సమన్వయపరుస్తారో!

కాగా, ప్రభుత్వం సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టిందని పిటిషనర్లు అభ్యంతరం తెలిపింది కేవలం విద్యుత్ సంస్కరణల చట్టం విషయంలో కాదు. మొత్తంగా విద్యుత్‌రంగ సంస్కరణలలో భాగమైన అన్ని కీలక నిర్ణయాలూ ప్రపంచబ్యాంకు ఒత్తిడికి లోనయి తీసుకుందని. 2007 నాటికి సబ్సిడీలు మొత్తం తొలగిస్తామనీ, క్రాస్ సబ్సిడీ కూడా తొలగిస్తామనీ, విద్యుత్ పంపిణీని పూర్తిగా ప్రైవేట్‌పరం చేస్తామనీ, విద్యుత్ చార్జీలు 2001లోనూ 2002లోనూ 15శాతం, ఆపైన ప్రతిసంవత్సరం 12శాతం పెంచుతామనీ విద్యుత్ పంపిణీని పూర్తిగా ప్రైవేట్‌పరం చేస్తామనీ చేసుకున్న ఒప్పందాన్నే సార్వభౌమత్వాన్ని అతిక్రమించిన చర్యగా పిటిషనర్లు వర్ణించారు. అది రాజ్యాంగవిరుద్ధం అవునో కాదో కోర్టు తేల్చాలని అడిగారు.

అది రాజ్యాంగవిరుద్ధం అనడానికి రెండు న్యాయ సిద్ధాంతసమ్మతమైన వాదనలను పిటిషనర్లు

కోర్టు ముందు ఉంచారు. ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు అప్రస్తుతమైన, అసందర్భమైన కారణాలను లెక్కలోకి తీసుకున్నట్లయితే ఆ నిర్ణయం చట్టబద్ధం కాదు. విద్యుత్ సంస్కరణలకు సంబంధించిన నిర్ణయానికి కారణాలు విద్యుత్‌రంగం బాగోగులతో ముడిపడినవయి ఉండాలి. అప్పిచ్చిన వాడు షరతులు పెట్టాడన్న కారణంగా ఏ నిర్ణయమైనా చేయడం అసందర్భమైన, అప్రస్తుతమైన కారణమవుతుంది. రెండు. ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులు ప్రజల బాగోగుల గురించి తమకున్న అవగాహనను అనుసరించి (ఆ అవగాహన మంచిదా చెడ్డదా అన్నది వేరే విషయం) నిర్ణయాలు చేయడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం (రెప్రెజెంటేటివ్ డెమోక్రసీ) లక్షణం. అది భారత రాజ్యాంగం మౌలిక స్వరూపంలో భాగమని సుప్రీంకోర్టు చాలాసార్లు అనింది. ప్రజలెన్నుకోని పరాయి దేశస్తులు విధాన నిర్ణయాలు చేయడం, దానిని మనవాళ్లు అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధం.

దీనికి హైకోర్టు ఏ జవాబూ చెప్పలేదు. జవాబు చెప్పకుండానే తుదితీర్పు ఇచ్చేసింది.

హైకోర్టు జవాబు చెప్పని మరొక ముఖ్యమైన అభ్యంతరం ఉంది.

## చట్టం లక్ష్యాలకు అర్థం కల్పించని కోర్టు

కరెంటు చార్జీలు నిర్ణయించిన విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం విస్తృతమైన అధికారాలిచ్చింది. ఆ అధికారాల నిర్వహణకు విశాలమైన ప్రాతిపదికను కూడా నిర్దేశించింది. 'విద్యుత్ పరిశ్రమను వ్యాపారసరళిలో' నడపాలన్నదొక్కటే ఆ చట్టం ఆదేశం కాదు. విభిన్న అవసరాలనూ ప్రయోజనాలనూ ప్రమాణాలనూ దృష్టిలో పెట్టుకొని కమిషన్ తన విధులు నిర్వర్తించాలి.

కరెంటు సరఫరా, పంపిణీ 'సమర్థంగా, పొదుపుగా, న్యాయబద్ధంగా' జరిగేటట్టు చూడాలి. అమ్మకందారుకు విద్యుత్ వ్యాపారం గిట్టుబాటయ్యేటట్టు చూడడమే కాక, కొనుగోలుదార్ల ప్రయోజనాలను కూడా కాపాడాలి. విద్యుత్ పరిశ్రమలో ప్రైవేట్‌రంగం ప్రవేశానికి మార్గం సుగమం చేస్తూ అదే సమయంలో వినియోగదారులకు న్యాయం జరిగేటట్టు చూడాలి. సరఫరా కంపెనీలు విద్యుదుత్పత్తి కంపెనీల నుండి చేసే కరెంటు కొనుగోలు పొదుపుగా, పారదర్శకంగా ఉండేటట్టు చూడాలి- ఇవన్నీ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ప్రామాణికమైన నియమాలు.

ప్రైవేటీకరణకు శాసనప్రాతిపదిక కల్పించడం కోసం తయారు చేసిన ఈ చట్టంలో ఇన్ని విషయాలు ఎందుకు చేర్చారన్నది కొంచెం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఇవి ప్రభుత్వానికి తలనొప్పిగా పరిణమించగలవని గుర్తించిన అడ్వకేట్ జనరల్‌గారు కేసువాదనల సందర్భంలో 'ఏవేవో అక్కరకురాని ఆదర్శాలన్నీ రాశారు దీనిలో' అని బాహాటంగానే విసుక్కున్నారు కూడా.

అక్కరకొచ్చేవో అక్కరకు రానివో ఆయనగారి నుంచి నేర్చుకోనక్కరలేదుగానీ, ఈ లక్ష్యాలన్నిటికీ అర్థం కల్పించవలసిన బాధ్యత హైకోర్టు మీద ఉండింది. ధరల నిర్ణయం ఈ లక్ష్యాల వెలుగులో జరిగిందా లేదా అని పరిశీలించవలసిన బాధ్యత ఉండింది. ఒక కొత్త చట్టం మొదటిసారి కోర్టుముందుకొచ్చినప్పుడు దానిని సమగ్రంగా వ్యాఖ్యానించి దానిని ఏ విధంగా అర్థం చేసుకోవాలో విడమరిచి చెప్పే సత్సంప్రదాయమొకటి మన న్యాయవ్యవస్థకు ఉండింది. ఈ కేసులో మన హైకోర్టు ఆ పనేమీ చేయలేదు. విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు విద్యుత్ సంస్కరణల చట్టం నిర్దేశించిన విశాలమైన లక్ష్యాలకు ఏ అర్థమూ కల్పించకుండానే తన పరిశీలన ముగించింది.

అందులో భాగంగా, విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు చట్టం నిర్దేశించిన బాధ్యతలన్నిటినీ కలిపి అర్థం చేసుకోవాలనీ మిగిలిన బాధ్యతల నుండి అమ్మకపు ధరను నిర్ణయించే బాధ్యతను వేరు చేసి వ్యవహరించడం చట్టవిరుద్ధమనీ పిటిషనర్లు లేవదీసిన వాదనకు హైకోర్టు ఏ జవాబూ చెప్పలేదు. అసలు ఈ విషయాన్ని తన తీర్పులో ప్రస్తావించనే లేదు.

విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీలలో ఒక్క ఉత్పత్తి మీద మాత్రమే విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు అధికారం లేదు. సరఫరా, పంపిణీలపైన అజమాయిషీ కమిషన్‌దే. ఆ రెండు రంగాలలోని కంపెనీలకు లైసెన్స్ ఇచ్చేది నియంత్రణ కమిషనే. 'సమర్థత, పొదుపు, న్యాయబద్ధత', 'వ్యాపారి ప్రయోజనాలనూ వినియోగదారుల ప్రయోజనాలనూ కాపాడుతూ విద్యుత్ పరిశ్రమలో పోటీతత్వం పెంచడం' అనే లక్ష్యాలకు తగిన షరతులను ఆ లైసెన్స్‌లోనే కమిషన్ నిర్దేశించవచ్చు. ప్రత్యేకించి, సరఫరా కంపెనీ ఉత్పత్తి కంపెనీల నుండి విద్యుత్తును కొనుగోలు చేసే విషయంలో పొదుపు, పారదర్శకత పాటించాలన్న నియమం లైసెన్స్‌లోనే పొందుపరిచే అధికారం కమిషన్‌కు ఉంది.

చట్టంలో ఈ విధంగా ఉండగా, జరిగిందేమిటంటే రాష్ట్రంలోని ఏకైక సరఫరా కంపెనీ అయిన ఎ.పి.ట్రాన్స్‌కో విద్యుత్‌నియంత్రణ కమిషన్ ఉనికిలోకి రాకముందే అనేక ఉత్పత్తి కంపెనీలతో కొనుగోలు ఒప్పందాలు చేసేసుకుంది. ఆ ఒప్పందాలే దాని ఆదాయ అవసరాలను నిర్ణయించాయి. ఆ ఆదాయ అవసరాల పద్దే టారిఫ్ పెంపుదలకు ప్రాతిపదిక. ఈ పెంపుదల మాత్రం విద్యుత్ నియంత్రణ కమిషన్ ద్వారా జరిగింది.

విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉనికిలోకి వచ్చిన తరువాత ఎ.పి.ట్రాన్స్‌కో తన సరఫరా లైసెన్స్‌ను పునరుద్ధరించమని అప్లికేషన్ కమిషన్‌కు పెట్టుకుంది. కొత్తగా సరఫరా లైసెన్స్‌కోసం అర్జీ పెట్టుకొని ఉంటే ఆ అర్జీదారు చేసే విద్యుత్ కొనుగోలు పైన పొదుపు, పారదర్శకతలకు సంబంధించిన షరతులు పెట్టే అధికారం ఉన్న కమిషన్, పాత లైసెన్స్ పునరుద్ధరణ కోసం ట్రాన్స్‌కో అర్జీ పెట్టుకున్నప్పుడు అప్పటికి ట్రాన్స్‌కో చేసుకున్న కొనుగోలు ఒప్పందాలను పరిశీలించి ఆ ఒప్పందాలు ఎంత పొదుపుగా, ఎంత పారదర్శకంగా చేసుకునిందో పరిశీలించి ఉండవలసింది. ఆ ప్రమాణాలకు అనుగుణంగా లేని ఒప్పందాలను రద్దు చేసి తిరిగి ఒప్పందాలు చేసుకోవలసిందిగా ఆదేశించవలసి ఉండింది. ఇదీ పిటిషనర్ల వాదన.

అయితే విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆ పని చేయలేదు. ఎ.పి.ట్రాన్స్‌కో అప్పటికే చేసుకున్న కొనుగోలు ఒప్పందాలను కనీసం తెరిచి చూడకుండానే ట్రాన్స్‌కో లైసెన్స్‌ను పునరుద్ధరించేసింది. తాను పరిశీలించని కొనుగోలు ఒప్పందాల పర్యవసానమైన ట్రాన్స్‌కో ఆదాయ అవసరాలను ప్రాతిపదిక చేసుకుని ప్రజలు చెల్లించవలసిన కరెంటు చార్జీలను నిర్ణయించింది. ఇది ప్రాథమికంగానే అభ్యంతరకరమని పిటిషనర్లు వాదించారు.

పోనీ కమిషన్ పరిశీలించినా పరిశీలించకపోయినా ఆ కొనుగోలు ఒప్పందాలు పొదుపుగా, పారదర్శకంగా ఉండి ఉంటే ధరల నిర్ణయానికి వచ్చిన తేడా ఏమీ లేదు కదా అనవచ్చును. కానీ వాటిలో పొదుపు లేదు, పారదర్శకత లేదు. ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థల నుండి కొనుగోలు చేసిన ధర కంటే 100 నుండి 150 శాతం ఎక్కువకు (అంటే రెండు నుండి రెండున్నరరెట్ల ధరకు) ప్రైవేట్ విద్యుదుత్పత్తి కంపెనీలతో ట్రాన్స్‌కో కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. అంతేకాక, వాళ్లు ఎంత ఉత్పత్తి చేస్తే అంతా కొంటామని 'కౌంటర్ గ్యారంటీ' కూడా ఇచ్చింది.

ఈ కొనుగోలు ఒప్పందాలను గుడ్డిగా ఆమోదించి ఆ ప్రాతిపదికన మనం ట్రాన్స్‌కోకు చెల్లించవలసిన ధరను నిర్ణయించిన విద్యుత్ నియంత్రణ కమిషన్ చర్య చట్టవిరుద్ధమన్న వాదనను హైకోర్టు పట్టించుకోలేదు. తన తీర్పులో ఎక్కడా ప్రస్తావించనే లేదు.

## ఆదేశిక సూత్రాల గతీ అంతే

సబ్సిడీ తొలగింపు గురించి కూడా పిటిషనర్ల వాదనను హైకోర్టు తేలికగా కొట్టి పారేసింది. రెండు ముఖ్యమైన ఆదేశిక సూత్రాలు ఈ సందర్భంలో చర్చకు వచ్చాయి.

ఆర్టికల్ 38(2): వ్యక్తుల మధ్యనే కాక భిన్నవృత్తులు అనుసరించే వారి మధ్య, భిన్న ప్రాంతాలలో నివసించేవారి మధ్య, ఆదాయాలలోని అసమానతలను, స్థితిగతులలోనూ అవకాశాలలోనూ సదుపాయాలలోనూ ఉన్న అసమానతలను తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేయాలి.

ఆర్టికల్ 39(బి): సమాజం భౌతిక వనరుల యాజమాన్యము, నిర్వహణ సమష్టి యోగక్షేమాలకు తగిన పద్ధతిలో పంపిణీ అయ్యేటట్లు,

ఆర్టికల్ 39 (సి) ఆర్థిక వ్యవస్థ పనితీరు ఫలితంగా సంపద, ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై సమష్టి ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి రాకుండా ఉండేటట్టు ప్రభుత్వం తన విధానరచనను చేపట్టాలి.

ఇవి ఆదేశిక సూత్రాలు కాబట్టి వీటిని అమలు చేయమని కోర్టులు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయలేకపోవచ్చు. ఏ సందర్భంలో వీటి అమలుకు ప్రభుత్వం ఏ మేరకు చర్యలు చేపట్టేదీ ప్రభుత్వం విచక్షణకు వదిలేయాలంటే తప్పుపట్టలేకపోవచ్చు. కానీ ఆ ఆదేశిక సూత్రాల అమలుకు సాధనాలుగా ఉన్న సబ్సిడీల వంటి విధానాలను 2007 తరువాత ఇంకెప్పుడూ చపట్టబోమని ప్రపంచబ్యాంకుతో ఒప్పందం చేసుకోవడాన్ని కోర్టులు తప్పుపట్టలేవా?

రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలను హక్కులుగా ఎందుకు రాయలేదు? ప్రభుత్వ విధానాలకు రాజ్యాంగం సూచించే గమ్యంగా మాత్రమే ఎందుకు రాశారు? ఇప్పటికిప్పుడే వాటిని అమలు చేయడం సాధ్యం కాదనుకున్నారు కాబట్టి, అయినా ఎప్పటికయినా ఆ సూత్రాలలోని హక్కులను ప్రజలకు అందియ్యాలని భావించారు కాబట్టి. అందువల్ల ఈ రోజే ఈ ఆదేశిక సూత్రాన్ని అమలు చేయమని కోర్టులు ప్రభుత్వానికి ఆదేశం జారీ చేయలేకపోవచ్చునుగానీ ఆదేశిక సూత్రాలను అమలు చేయబోమని చట్టం చేసినా విధానప్రకటన చేసినా కోర్టులు ఊరుకోవనడానికి వీలులేదని పిటిషనర్ల వాదన. ఇది ఇప్పటివరకు మన న్యాయవ్యవస్థ ముందు చర్చకురాని ప్రతిపాదనకానీ గ్లోబలైజేషన్‌నేపథ్యంలో పదే పదే చర్చకు రాబోతుంది. దీనికి న్యాయవ్యవస్థ ఏదో ఒక రోజు జవాబు చెప్పవలసి ఉంటుంది. ఆ పని మన హైకోర్టు మొదలుపెట్టి ఉంటే ఉపయోగకరంగా ఉండేది.

దురదృష్టవశాత్తు మన హైకోర్టు రాష్ట్రప్రభుత్వ సంస్కరణలు ఆదేశిక సూత్రాలను అతిక్రమిస్తాయనడం సత్యదూరమని చెప్పి కొట్టి పారేసింది.

## నిర్ణయం అహేతుకమైనా చూడదలచుకోని కోర్టు

కచ్చితమైన సమాచారం లేకుండా అరకొర సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయం అహేతుకమైనదని కొట్టివేయడానికి మాత్రం కొత్త సూత్రీకరణ ఏదీ చేయనవసరం లేదు. ట్రాన్స్‌కో

సరఫరా చేసే కరెంటులో 41% గురించి మాత్రమే వారి వద్ద కచ్చితమైన సమాచారం (ఏ కోవకు చెందిన వినియోగదారులు అందులో ఎంత భాగాన్ని వాడుకుంటున్నారన్న సమాచారం) ఉంది. ఎందుకంటే 41% కరెంటు మీటర్ల గుండా సరఫరా అవుతుంది. మిగిలిన 59% మీటర్లకు అందదు. అందులో వ్యవసాయరంగం వాడుకునే కరెంటు ఉంది. ఇది విధానపరంగానే మీటర్లకెక్కదు. దొంగతనంగా వాడుకునే కరెంటు ఉంది. ఇది దొంగకరెంటు కాబట్టి మీటర్లకెక్కదు. 'సరఫరా నష్టాలు' - అంటే సరఫరాక్రమంలో జరిగే సాంకేతిక నష్టం- ఉంది. ఇదంతా కలిపి మొత్తం కరెంటులో 59%. ఇందులో సరఫరా నష్టాలు 4.5% ఉండవచ్చునని అంచనా. వ్యవసాయరంగానికిచ్చేది, పంపిణీనష్టం అని పిలవబడే కరెంటు దొంగతనం కలిపి మిగిలిన 54.5%. ఈ రెండింటిలో ఏది ఎంత అనేది తెలియదనేది ట్రాన్స్‌కో సహితం ఒప్పుకునే విషయమే. సరయిన ఆధారం లేని అంచనాలతో ట్రాన్స్‌కో తన ప్రతిపాదనలు రూపొందించుకునింది. ఆ అంచనాలు స్థిరంగా కూడాలేవు.

1995-96దాకా తమ అంచనాలలో వ్యవసాయరంగం వినియోగాన్ని ఎక్కువగానూ పంపిణీ నష్టాన్ని తక్కువగానూ చూపించారు. 1996-97 నుండి అకస్మాత్తుగా దీనిని తారుమారు చేసి వ్యవసాయ వినియోగాన్ని తక్కువగానూ కరెంటు చౌర్యాన్ని ఎక్కువగానూ చేసి చూపించడం మొదలు పెట్టారు. 1998-99లో దొంగకరెంటు మొత్తం కరెంటులో 38% ఉందన్నారు.

ఇక్కడ రెండు అభ్యంతరాలు పిటిషనర్లు కోర్టు ముందు ఉంచారు. ఇంత అస్పష్టమైన సమాచారాన్ని ఆధారం చేసుకొని విద్యుత్ నియంత్రణ కమిషన్ చేసిన నిర్ణయం అహేతుకమైనది కాబట్టి అది చెల్లదన్నది ఒకటి. కరెంటు చౌర్యం 38% ఉందని ట్రాన్స్‌కోయే ఒప్పుకుంటున్నప్పుడు ఆ భారమంతా నిజాయితీగా బిల్లులు చెల్లించేవారిపైన పెట్టి చార్జీలు నిర్ణయించడం అన్యాయమన్నది రెండవది.

ఇందులో మొదటి అభ్యంతరానికి హైకోర్టు ఏ జవాబూ చెప్పలేదు. రెండవ అభ్యంతరం గురించి ఏమనిందంటే సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా తన ఖర్చు 500 కోట్ల మేరకు తగ్గించుకుంటానని ట్రాన్స్‌కోయే కమిషన్ ముందు ఒప్పుకున్న విషయాన్నీ, కమిషన్ ఆ అంగీకారాన్ని లెక్కలోకి తీసుకొని వినియోగదార్లు చెల్లించవలసిన మొత్తం నుండి 500 కోట్లు మినహాయించిన విషయాన్నీ ప్రస్తావించి అదే ఈ అభ్యంతరానికి జవాబు అనింది.

కానీ 500 కోట్లే ఎందుకు? 1000 కోట్లు ఎందుకు కాకూడదు? ఈ ప్రశ్న జడ్జీలే వాదనలక్రమంలో ట్రాన్స్‌కో న్యాయవాదినీ కమిషన్ న్యాయవాదినీ అడిగారు. వాళ్లు ఎంతోకొంత ఆదా చేస్తామని ఒప్పుకుంటే వీళ్లు మంచిదే అనడం హేతుబద్ధమైన నిర్ణయమయిపోతుందా? కోర్టులో జడ్జీలడిగిన ప్రశ్నకు ఆ న్యాయవాదులిద్దరూ ఏ జవాబూ చెప్పలేదు. అయినప్పటికీ జడ్జీలు సంతృప్తి చెందిపోయారు. పంపిణీనష్టం 14 లేక 15 శాతం దాదాపు అన్ని దేశాలలోనూ ఉంటుందనీ ఆ మేరకు చౌర్యాన్ని భరించక తప్పదనీ నిపుణులు అంటారు. అటువంటప్పుడు ప్రస్తుతం ఉందని (లెక్కలకు ఆధారాలేవీ చూపకుండా) చెప్తున్న 38 శాతాన్ని 15కు దించడానికి ట్రాన్స్‌కోకు ఒక హేతుబద్ధమైన గడువుపెట్టి, ఒక్కొక్క సంవత్సరం ఆ దిశగా ఎంత అభివృద్ధి సాధించాలో నిర్దేశించి ఆ షరతు మీద విద్యుత్ చార్జీల పెంపుదలను ఆదేశించి ఉన్నా ఒక రకం. కమిషన్ ఆ పని చేయలేదు, అది తప్పని హైకోర్టు భావించలేదు.

## అసలా చట్టమే చెల్లుతుందా?

విద్యుత్‌సంస్కరణలలో కీలకమైన పాత్ర నిర్వహించే నియంత్రణ కమిషన్ ఏర్పాటుకు చట్టరూపం ఇస్తూ కేంద్రప్రభుత్వం అప్పటికే ఒక చట్టం చేసి ఉండగా రాష్ట్రప్రభుత్వం వేరొక చట్టం చేయడానికి ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందమే కారణమనీ, రాష్ట్రచట్టానికి ఆర్టికల్ 254(2) కింద రాష్ట్రపతి నుండి ఆమోదం పొందేటప్పుడు ఈ సంగతి చెప్పలేదు కాబట్టి రాష్ట్రపతి ఇచ్చిన ఆమోదం చెల్లదనీ పిటిషనర్లు వాదించారు. వాదనల సమయంలో జడ్జీలు దీనిని సీరియస్‌గానే తీసుకున్నారు. రాష్ట్రపతి ఆమోదం కోసం రాష్ట్రప్రభుత్వం సమర్పించిన మెమొరాండంను కోర్టులో ప్రవేశపెట్టమని అడ్వకేట్ జనరల్‌ను కోరారు. రెండుసార్లు వారు అడిగినప్పటికీ అడ్వకేట్ జనరల్ ఆ పని చేయలేదు. దానిని బట్టి పిటిషన్ల అభియోగం వాస్తవమేనన్న నిర్ణయానికి కోర్టు రావలసి ఉండింది. కోర్టు ఆ పనేమీ చేయకుండా, ఆర్టికల్ 254(2) కింద రాష్ట్రపతి ఇచ్చే ఆమోదం కోర్టుల పర్యవేక్షణ పరిధిలోకి రాదని ప్రకటించింది. ఇది న్యాయసిద్ధాంతం రీత్యా కూడా చాలా సందేహాస్పదమైన అభిప్రాయం. రాజ్యాంగం ఎవరికిచ్చిన ఏ అధికారమైనా సక్రమంగానే నిర్వర్తించాలనేది ఒక సాధారణసూత్రం. అన్ని నిర్ణయాల తప్పొప్పులపైన కోర్టులు తీర్పు చెప్పలేకపోవచ్చునుగానీ నిర్ణయం సక్రమంగా తీసుకున్నారా లేదా అని పర్యవేక్షించవచ్చును. నిర్ణయం సక్రమంగా తీసుకునే ప్రక్రియలో ఒక ముఖ్య విషయమేమిటంటే ఆ నిర్ణయానికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని లెక్కలోకి తీసుకోవడం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో చేసుకున్న ఒప్పందాన్నీ ఒప్పుకున్న షరతులనూ లెక్కలోకి తీసుకోకుండా ఆ ఒప్పందంలో భాగమైన చట్టానికి ఆర్టికల్ 254(2) కింద రాష్ట్రపడి ఇచ్చిన ఆమోదం చెల్లదు. కాబట్టి ఆ చట్టమూ చెల్లదు, దాని కింద చేసిన ధరల నిర్ణయమూ చెల్లదు.

## ముగింపు

సామాజిక ప్రాముఖ్యం ఉన్న విషయాలపైన న్యాయవ్యవస్థ ఇచ్చే తీర్పులను విమర్శిస్తే 'మమ్మల్ని మీ రాజకీయాలలో భాగం కమ్మనవద్దు' అనీ 'మమ్మల్ని విధాన నిర్ణయాలు చేయమనవద్దు' అనీ జడ్జీలు అంటారు. 'మేము రాజ్యాంగాన్నీ చట్టాలనూ అమలు చేయించే పని మాత్రమే చేస్తాం' అంటారు. ఆ పని చేయమనే అడుగుతున్నాం. ఎటొచ్చీ రాజ్యాంగాన్నీ చట్టాన్నీ సంకుచితంగా అర్థం చేసుకోకుండా సరయిన స్ఫూర్తితో అర్థం చేసుకొమ్మంటున్నాం. అంతకు మించి ఎవరైనా ఆవేశంలో కోర్టులు విధాన నిర్ణయాలు చేయడం లేదని విమర్శిస్తే బాధ్యతగల వ్యక్తులుగా మేమే వద్దంటున్నాం. ఆ బాధ్యత కోర్టుల పట్ల బాధ్యత కాదు, ప్రజల పట్ల బాధ్యత. ప్రజలకూ ప్రజాభిప్రాయానికీ ఏరకంగానూ బాధ్యులుగాని న్యాయమూర్తుల చేతిలో విధాన నిర్ణయాలు చేసే అధికారం పెట్టడం ప్రజలకు మంచిది కాదు. ఎంత చెడ్డా ఆ పని ప్రజాభిప్రాయానికి ఏదో ఒక రూపంలో జవాబుదారు కాకతప్పని రాజకీయ వ్యవస్థ చేయడమే మంచిది.

కానీ రాజ్యాంగాన్నీ చట్టాన్నీ అమలు చేయించే బాధ్యతను సంకుచితంగా కాక విశాల దృక్పథంతో చేయాలని అంటున్నాం. ఆ విశాల దృక్పథాన్ని కూడా ఎవరి 'రాజకీయాల' నుండీ అరువు తెచ్చుకొమ్మనడం లేదు. రాజ్యాంగంలోనే దానికి కావలసిన రాజకీయస్ఫూర్తి ఉంది, న్యాయశాస్త్రంలోనే కొన్ని ప్రామాణిక సూత్రాలు ఉన్నాయి. ఇప్పటికింకా లేనివాటిని అభివృద్ధి చేసే అవకాశమూ ఉంది.

భారతరాజ్యాంగానికొక రాజకీయ నేపథ్యం ఉంది. సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ ఏదో ఒక మేరకు స్పృశించిన పోరాటాలు రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చాయి. ఎన్ని లోపాలతోనయినప్పటికీ ఆ స్ఫూర్తి రాజ్యాంగంలో కనిపిస్తుంది. మన న్యాయవ్యవస్థ దానికి నిండయిన అర్థం ఇవ్వడంలో విఫలమయిందనే చెప్పాలి. రాజ్యాంగం పీఠిక, ఆదేశిక సూత్రాలు దేశం గమ్యాన్ని సూచిస్తాయనీ, రాజ్యాంగంలోని హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థ దానికి సాధనమనీ రాజ్యాంగకర్తలే అన్నారు. ఆ స్ఫూర్తితో రాజ్యాంగానికీ చట్టాలకూ అర్థం కల్పించే న్యాయసిద్ధాంతాన్ని భారత న్యాయవ్యవస్థ అభివృద్ధి చేయలేకపోయింది. ఈ వైఫల్యాన్ని కొంత మేరకైనా అధిగమించడానికి 1980లలో జరిగిన ప్రయత్నానికి గండికొట్టడం 1990లలో మొదలయింది. 'గ్లోబలైజేషన్' ప్రభావం పెరిగేకొద్దీ ఈ తిరోగమనం కూడా బలం పుంజుకుంటున్నది.

ఇది కాకతాళీయం కాదు. 'గ్లోబలైజేషన్' పట్ల మన సమాజంలో కులమూ డబ్బూ కలవాళ్లలో అధికభాగం అనుకూలంగా ఉన్నారు. న్యాయమూర్తులు అందులో భాగమే. రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చిన సమతా సంక్షేమ ఆకాంక్షలను ఈ కోవకు చెందినవారంతా ఈ రోజొక బరువుగా ఆ భావిస్తున్నారు. ఆ బరువును ఎంత తొందరగా దించుకుంటే అంతవేగంగా దేశం 'అభివృద్ధి' వైపు ప్రయాణిస్తుందని నమ్ముతున్నారు.

ఈ వైఖరి ప్రతిఫలనం 'విద్యుత్ చార్జీల' తీర్పులో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అయితే వారికక్కరలేని సమతా సంక్షేమాల స్ఫూర్తి ప్రజలకవసరం కాబట్టి రాజ్యాంగం కింద బాధ్యతలు నిర్వర్తించే ప్రతీ ఒక్కరినీ ప్రజల తరపున నిలదీయవలసిందే.

●